క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చండూరు : మున్సిపల్ కేంద్రంలో జరగనున్న కాళికాదేవి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం కమిటీ సభ్యులు చండూరులో ఆవిష్కరించారు. 25న శుక్రవారం గణపతి పూజ, సామూహిక వరలక్ష్మి వ్రతం, 26న వేదపారాయణం, 27న అమ్మవారికి బోనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహాసభల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న శంకర్

కనగల్ : ఎస్ఎఫ్ఐ జిల్లా 44వ మహాసభలను సెప్టెంబర్ 2,3,4 తేదీల్లో హాలియాలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. బుధవారం బుడుమర్లపల్లి ఆదర్శ పాఠశాలలో మహాసభల కరపత్రాన్ని విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ అక్రమ్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, సాయి, పవన్, కళ్యాణ్, లోకేష్, గిరీష్, స్వప్న, కల్పన పాల్గొన్నారు

నేడు ఎమ్మెల్యే రాక

మునుగోడు : ప్రభుత్వం పెంచిన ఆసరా పెన్షన్లు పంపిణీ చేసేందుకు గురువారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మునుగోడుకు రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా చల్మెడ గ్రామం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ వితరణ



చీర అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు

కనగల్ : మండలవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఒక పల్లిపట్టి ప్యాకెట్, క్యాలెండర్, మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు చీరలను బుధవారం సత్యసాయి ట్రస్ట్ వారి సౌజన్యంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందించారు. ఎంఈఓ తరి రాములు కనగల్, బుడుమర్లపల్లి, బోయినపల్లి ప్రాథమిక పాఠశాలల్లో స్వయంగా విద్యార్థులకు పల్లీపట్టి అందించారు.

గాంధీ విగ్రహానికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : ఎల్‌బీ నగర్‌లో గిరిజన మహిళపై దాడి చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం గిరిజన కార్మిక సంఘం అధ్యక్షుడు నగేష్‌నాయక్ ఆధ్వర్యంలో రామగిరిలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మేడం వెంకన్న, అంగోతు సురేందర్ నాయక్, రమావత్ బాలాజీ నాయక్, లాజర్, యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

సీఎం కు రుణపడి ఉంటాం

కనగల్ : తమకు పీఆర్‌సీతో కూడిన వేతనాన్ని అందించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని గోపాలమిత్రల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రోల్ల సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 శాతం పీఆర్సీ పెంచి నెలకు రూ.11050 చొప్పున రెండు నెలల వేతనాన్ని గోపాలమిత్రల ఖాతాలో ప్రభుత్వం బుధవారం జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు కారింగు జగత్, ఆమనగంటి అరుణ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది

మిర్యాలగూడ టౌన్: బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆ జాబితాను మార్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాల వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండి మోసపోయిన బీసీలతో ఈ నెల 26న హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, రవి, రాంబాబు యాదవ్, శేఖర్, సతీష్ తదితరులున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

- ఎండ, వానలో వాహనాల కోసం నిరీక్షణ
- జి.చెన్నారం, దోరెపల్లి స్టేజీల వద్ద నిర్మించాలని వేడుకోలు



బస్‌షెల్టర్ లేక వాహనాల కోసం దోరెపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎండలోనే నిల్చున్న విద్యార్థులు

కనగల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని దేవరకొండ ప్రధాన రహదారిపై జి.చెన్నారం, దోరెపల్లి క్రాస్ రోడ్‌ల వద్ద బస్‌షెల్టర్లు నిర్మించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రయాణికులు, విద్యార్థులు వేడుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్‌ల నుంచి దోరెపల్లి, పగిడిమర్రి, జి.చెన్నారం, లింగాలగూడెం, రేగట్టె, శాబ్దుల్లాపురం, ఏమిరెడ్డిగూడెం, కురంపల్లి గ్రామాలతోపాటు వాటి అనుబంధ గ్రామాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. పొనుగోడు, చండూరు మార్గాలకు వెళ్లే ప్రయాణికులకు తక్కువ దూరం కావడంతో వారికి కూడా ఇదే ప్రధాన రహదారిగా నిలిచింది. ఈ మార్గం గుండా ఆర్టీసీ బస్సు ఉదయం వేళ మాత్రమే నడుస్తుంది. ఈ గ్రామాలకు నేరుగా సమయానికి బస్సులు లేకపోవడంతో జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్‌ల వద్దకు చేరుకుని ఇక్కడి నుంచి విద్యార్థులు, ప్రయాణికులు నల్లగొండ పట్టణానికి ప్రయాణిస్తుంటారు.

ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం..

బస్సులు, ఆటోలు ఆలస్యమైతే ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్‌ల వద్ద బస్‌షెల్టర్లు లేకపోవడంతో పాటు మంచినీరు, నీడ లేక ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు, ఆటోలు సమయానికి రాకపోవడంతో ఎండ, వానలో నిల్చొని పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు పాలు, కూరగాయలు ఇతర వ్యాపారాలు చేసుకునే వారు జి చెన్నారం, దోరెపల్లి క్రాస్‌రోడ్‌ల వద్దకు వచ్చి వాహనాల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో నిల్చొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల నుంచి 300 మంది విద్యార్థులు నిత్యం నల్లగొండ పట్టణానికి చదువుల కోసం వెళ్తుంటారు. ఈ గ్రామాలకు బస్సులు లేకపోవడంతో నల్లగొండ నుంచి జి చెన్నారం, దోరెపల్లి స్టేజీల వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఆటోల ద్వారా అవస్థలు పడుతూ వారి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ మార్గాల్లో నిత్యం సక్రమంగా బస్సులను నడిపి, బస్‌షెల్టర్లను ఏర్పాటుచేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



జి .చెన్నారం, దోరెపల్లి క్రాస్ రోడ్‌ల వద్ద బస్‌షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సు, ఆటోలు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి రోడ్ల మీద నిరీక్షిస్తున్నాం. ఎండ, వాన వచ్చినప్పుడు నరకం చూస్తున్నాం. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకుని బస్‌షెల్టర్ నిర్మించాలి.

– మండలి మధు, డిగ్రీ విద్యార్థి, శాబ్దుల్లాపురం

బస్‌షెల్టర్ నిర్మించాలి



చండూరు, దోరెపల్లి, పగిడిమర్రి, శాబ్దుల్లాపురం, లింగాలగూడెం, ఏమిరెడ్డిగూడెం, రేగట్టె, కురంపల్లి, రాంచంద్రపురం, పొనుగోడు గ్రామాలతోపాటు వాటి అనుబంధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ బస్‌షెల్టర్ లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని జి చెన్నారం, దోరెపల్లి క్రాస్ రోడ్‌ల వద్ద బస్‌షెల్టర్లు నిర్మించి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలి.

-జెట్టి శ్యాంసుందర్ యాదవ్, కురంపల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



దోరెపల్లి, జి చెన్నారం గ్రామాల వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా. గతంలో కూడా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్థలం లేక నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. త్వరలోనే బస్‌షెల్టర్ ఏర్పాటుకు కృషిచేసి ప్రయాణికుల సమస్యలను తీర్చుతాం.

-అయితగోని యాదయ్యగౌడ్, దోరెపల్లి సర్పంచ్

పీజీ ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్ : ఉస్మానియా యూనివర్సిటీ 2023 జూలైలో నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అర్థ శాస్త్ర విభాగంలో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ కే. చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. వై రాజేష్ 103వ ర్యాంక్, పి. మధు 375వ ర్యాంక్, ఐ.స్వాతి 1295వ ర్యాంక్ సాధించారని వివరించారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ వి.శేఖర్, అర్థ శాస్త్ర విభాగాధిపతి హరిత అభినందించారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

కనగల్ : నల్లగొండ నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని బీజేపీ ఎస్సీమోర్చా నల్లగొండ జిల్లా కార్యదర్శి ఆదిమల్ల దేవేందర్ అన్నారు. బుధవారం కనగల్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దాసరి వెంకటేశం ఆధ్వర్యంలో దొరేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి ఎస్సీలతో మాట్లాడారు.దళిత బంధు పథకంలో సరైన విధివిధానాలు లేక అవినీతిమయం అయిందని ఆరోపించారు. గ్రామంలో ఉన్న ఎస్సీలందరూ దళితబంధు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి పరమేష్, దాసరి రాజు, దాసరి విజయ్, దాసరి రాములు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్



నకిరేకల్‌లో పెన్షన్ ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. దివ్యాంగులకు పెంచిన ఆసరా పెన్షన్ల ధృవపత్రాలను నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయిలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో పదివేల కోట్లు దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. పెరిగిన ఆసరా పెన్షన్ రాష్ట్రవ్యాప్తంగా 5లక్షలకు పైగా దివ్యాంగులకు ఆరథిక భరోసా ఇస్తుందన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో రూ.వెయ్యి వరకే పెన్షన్ ఇస్తున్నారని, తెలంగాణలోనే అత్యధికంగా రూ.4016 పెన్షన్ ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, స్వర్ణలత, వైఎస్ ఎంపీపీ గొర్ల సరిత వీరయ్య, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మున్సిపాలిటీలోని 18వ వార్డుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు 50మంది నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో చెరుకు వెంకటాద్రి, బట్టు చరణ్, ఎరుపుల నరేష్, కందుకూరి కమలాకర్, తిరుమల సాయి, గడ్డం శివ, సాయి, నాగసాయి, రాకేష్, శ్రీను, శ్రీకాంత్, వినోద్, నివాస్, మధులతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు పల్లె విజయ్, రాచకొండ సునిల్, నాయకులు రాచకొండ వెంకన్న, పెండెం సదానందం ఉన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు

నల్లగొండ : చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో జిల్లా ప్రజలంతా సంబరాలు జరుపుకున్నారు. జాబిల్లిపై విక్రమ్ ల్యాండ్‌ను టీవీల్లో ప్రత్యక్షంగా చూసేందుకు పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఏర్పాట్లు చేశారు. జాబిల్లిపై భారత్ జెండాను విక్రమ్ ల్యాండ్ ఎగురవేయడంతో అంతా ఆనందాలతో కేరింతలు కొట్టారు. జాతీయ జెండాలను పట్టుకొని ఊపుతూ సంబరాలు చేసుకున్నారు.

నార్కట్‌పల్లి : చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం నార్కట్‌పల్లి పట్టణంలో జనగణమన చౌక్ (నల్లగొండ చౌరస్తా)వద్ద జనగణమన కమిటీ ఆధ్వర్యంలో జాతీయ గీతాన్ని ఆలపించి, టపాసులు పేల్చి, మిఠాయి పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా అమ్మనబోలు చౌరస్తా నుంచి మునుగోడు చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగణమన కమిటీ అధ్యక్షుడు కన్నెబోయిన నరసింహ, సభ్యులు నోముల నాగరాజు, గోదల వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, రమేష్, నాగరాజు, అంజిరెడ్డి, వెంకన్న, రవి, మిట్ట శేఖర్‌రెడ్డి, గణేష్, శేఖర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, బైరోజు రవి పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : సంబరాలు చేసుకుంటున్న జనగణమన కమిటీ సభ్యులు



నల్లగొండ : సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు


చండూరు : చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో గట్టుప్పల సర్పంచ్ రోజా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. చండూరు గాంధీజీ పాఠశాలలో జై ఇస్రో ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. మాజీ సర్పంచ్ పోరెడ్డి ముత్తిరెడ్డి, రమేష్ నేత, సందీప్, రాయల్ గౌడ్, రమా, శంకర్, శ్రీకాంత్, సందీప్, రాంబాబు పాల్గొన్నారు.

నకిరేకల్ : చంద్రయాన్–3 ప్రయోగం వల్ల కలిగే ఉపయోగాలను నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కే చంద్రశేకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, హరిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : డిగ్రీ కళాశాలలో..

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కట్టంగూర్ : గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, వనం మైసమ్మ తల్లి విగ్రహాలను మండల కేంద్రంలోని కురుమర్తి రోడ్డు వెంబడి నూతనంగా నిర్మించిన ఆలయాల్లో బుధవారం పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజారులు యంత్ర ప్రతిష్ఠ, మంగళ హారతితోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

25న ప్రమాణ స్వీకారం

నల్లగొండ టౌన్ : ఈ నెల 25న హైదరాబాద్‌లోని మత్స్య భవన్‌లో సంస్థాన్ నారాయణపూర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ దీటి మల్లయ్య ప్రమాణ స్వీకారోత్సవానికి జిల్లా నుంచి గంగపుత్రులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.


బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

చండూరు : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, కర్ణాటక రాష్ట్ర విజయపురం ఎమ్మెల్యే బసన గౌడ పాటిల్ అన్నారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో చేనేత కళాకారుల కుటుంబాలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. మండల అధ్యక్షుడు నామని జగన్నాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, మునుగోడు నియోజగవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కర్నాటి రవితేజ, గట్టుప్పల మండల ఇన్‌చార్జ్ రాపోలు గోపీనాథ్, శక్తి కేంద్ర ప్రముఖ్‌లు, ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే బసన గౌడ

బ్లడ్ క్యాన్సర్ నుంచి కాపాడిన యశోద ఆస్పత్రి బృందం



మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణానికి చెందిన యువకుడికి ప్రాణాంతకమైన బ్లడ్ క్యాన్సర్ వ్యాధికి వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు మలక్‌పేట యశోద ఆస్పత్రి డాక్టర్ ఎల్.రోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో యువకుడిని తమ ఆస్పత్రికి తీసుకొస్తే అన్నిరకాల పరీక్షలు నిర్వహించి అక్యూట్ మైలోయిడ్ లుకేమియా అరుదైన బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. 5 రౌండ్లు కీమోథెరపీ ఇవ్వడం ద్వారా బ్లడ్‌క్యాన్సర్‌ను నయం చేసి ప్రాణాలు కాపాడామన్నారు. ఈ సమావేశంలో మలక్‌పేట యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే శ్రీనివాస్‌రెడ్డి, సిద్దార్థ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తా

- 50వేల మెజార్టీతో గెలుస్తా
- బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్



కార్యకర్తలతో మాట్లాడుతున్న పిల్లి రామరాజు

నల్లగొండ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 50 వేల మెజార్టీతో గెలుస్తానని కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. బుధవారం గంధవారిగూడెంలోని ఆయన గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు టికెట్ ఇస్తారని ఆశించానని కానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదమ్ముల పేర ఫౌండేషన్ ఏర్పాటు చేసి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, చనిపోయిన పేద కుటుంబాలను, ఆపదలో ఉన్నవారికి, పేద పిల్లల చదువుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నానని చెప్పారు. 30 సంవత్సరాలుగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉందన్నారు. ×మా నాన్న ఎంపీటీసీగా నేను ఎంపీటీసీగా, రెండుమార్లు కౌన్సిలర్‌గా పని చేసిన అనుభవం ఉంది×అన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి టీఆర్ఎస్‌లో చేరానని, కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలన్నింటినీ ముందుకు తీసుకుపోవడంలో కృషి చేశానని అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 52 సంవత్సరాలుగా ఒక్క ధర్మభిక్షానికి తప్ప బీసీకి ఎవరూ టికెట్ ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో 2.32 లక్షల ఓటర్లు ఉంటే లక్షన్నర మంది బీసీలు ఉండగా 30వేల మంది ఎస్సీలు, ఇతరులు ఉన్నారని, ఓసీలు 32వేల మంది ఉన్నారన్నారు. కేసీఆర్ దత్తతో స్థానిక నేతను ప్రజలు గెలిపించారు కానీ ఆయన మాత్రం ఏ నాయకుడిని ఎదగనివ్వలేదని అన్నారు. కార్యకర్తలను వేధింపులకు గురి చేయడంతోపాటు కేసులు పెడుతున్నారని వాటికి భయపడేది లేదన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ మారేది లేదని, ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని అన్నారు. ఓ పేదవాడు ఎమ్మెల్యే అయితే ఎలా ఉంటుందో సేవ చేసి చూపిస్తానని అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలను కోరారు.

రాబోయే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న తండు సైదులుగౌడ్

రామగిరి(నల్లగొండ): రాబోయే ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ అన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆయన దరఖాస్తు చేశారు. అనంతరం మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా బీసీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలన్నారు. 25 సంవత్సరాలుగా తిప్పర్తి మండలంతోపాటు నియోజకవర్గంలోని పేద ప్రజలకు చంద్ర ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు మెంబర్, సర్పంచ్, జెడ్పీటీసీగా గెలిచి చేసి ప్రజలకు సేవ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

నకిరేకల్ : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బుధవారం బీజేపీ నాయకులు ముట్టడికి యత్నించారు. బీజేపీ నేతలు ఒక్కసారిగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటును నెట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దూసుకురావడంతో అక్కడే సమావేశంలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించిన బీజేపీ నేతలను బలవంతంగా బయటకు తోసివేశారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు తమపై దాడులు చేసి గాయపర్చారని ఆరోపిస్తూ బీజేపీ నేతలు మెయిన్ సెంటర్‌లో ధర్నా చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు శేపూరి రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని క్యాంపు కార్యాలయం ముట్టడికి వస్తే తమ నేతలను, కార్యకర్తలను బయటకు నెట్టివేసి గాయపర్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు నకిరేకంటి మొగిలయ్య, అసెంబ్లీ కన్వీనర్ మైల నరసింహ, అయితగోని అనిత, మండల, పట్టణ అధ్యక్షులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, పల్స శ్రీను, నాయకులు జిల్లా దాకయ్య, బుడిగే సైదులు, చెనగాని రాములు, తాటిపాముల శివ కృష్ణ, కూర్వెళ్ల శ్రీను, రాచకొండ గోపి, బుద్ధుడు, చందు, వెంకన్న, సైదులు, వేణు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో అందించాలి

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని పూర్తిస్థాయిలో అందించి పునరావాసం కల్పించాలని పలు గ్రామాల భూనిర్వాసితులు బుధవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. తమ ఇళ్ల ముందు ఉన్న ఖాళీ స్థలాలకు కూడా ప్యాకేజీ చెల్లించలేదని వాపోయారు. ముంపు గ్రామాలతోపాటు భూనిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించే పరిహారంతోపాటు అన్ని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వల్లపుదాసు కేశవులుగౌడ్, ఐతగోని జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీగా గుర్తించాలని వినతి

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామపంచాయతీ పరిధిలోని దేవులతండా, రాగ్యతండాలను కలిపి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ రెండు తండాలకు చెందిన ప్రజలు స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి బుధవారం హైద్రాబాద్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బానావత్ సుధాకర్‌నాయక్, ఆంగోత్ రవి నాయక్, ఆంగోత్ కిషన్ నాయక్, ఆంగోత్ శంకర్ నాయక్, బానావత్ లచ్చిరామ్‌నాయక్ , నేనావత్ లక్ష్మణ్, నేనావత్, దేవేందర్, బానావత్ రఘునాయక్, ఆంగోత్ అంజయ్య పాల్గొన్నారు.



చండూరు : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటాం

మర్రిగూడ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో వామపక్ష కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి బరిలో ఉంటారని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో నీలకంఠం రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, చెల్లం ముత్యాలు, సొప్పరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్‌కు చేయూత

కనగల్ : మండల పరిధిలోని కురంపల్లి గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ తలారి సురేష్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్నాడు. బుధవారం సురేష్‌కు రూ.10 వేల నగదును గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ తరఫున మండల అధ్యక్ష,కార్యదర్శులు జిల్లా విజయ్, కొంగల నర్సింహ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, గ్రామపంచాయతీ సిబ్బంది శంకర్, కిరణ్, లోకేష్, శివశంకర్, వెంకన్న, యాదయ్య, సైదులు, మంజుల, జానకి రాములు, రాములు తదితరులున్నారు.



నగదు అందజేస్తున్న యూనియన్ నాయకులు

మురుగును యూజీడీలో కలపాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నల్లగొండ టూటౌన్ : వివిధ కాలనీల నుంచి వస్తున్న మురుగు పార్కులోకి రాకుండా దారి మళ్లించి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలోకి కలిపేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం 31వ వార్డు రాజీవ్ పార్కును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులోకి మురుగు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సిలర్ ఖయ్యూంబేగ్, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ సత్యనారాయణ, ఈఈ రాములు, ఏఈ దిలీప్, ఏసీపీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో జాతీయ సదస్సు

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో జరగనున్న దళిత ఎజెండా సదస్సును జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో గాదె నర్సింహా, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.